

'గురుకులం'లో స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - వెంకటాచలం

మండలంలోని గొలగముడి గ్రామం వద్ద ఉన్న బిసి గురుకుల పాఠశాలలో ఆదివారం జోనల్ స్పోర్ట్స్ మేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిసి గురుకుల సెక్రటరీ శ్రీ ఏ కష్ణమోహన్, జ్యోతిరావు పూలే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి అతిధులతో బీసీ గురుకుల డిప్యూటీ సెక్రటరీ శ్రీ పి మాధ వయ్య, బి కొండలరావు, పాఠశాల ప్రధా నోపాధ్యాయులు, క్రీడాకారులు ఉన్నారు.

స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న దృశ్య

గ్రామీణ రహదారులకు మహర్దశ

ప్రజాశక్తి-నెల్లూరు

సంక్రాంతి పండుగ నాటికి గ్రామీణ రహదారులను అందంగా ముస్తాబు చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని మంత్రి తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులు, ఎంపిడిఒలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంత్రి ఆనం రామనా రాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాలన ముం దుకు సాగుతుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో తొలి విడతగా 199 సిమెంట్ రోడ్లను రూ. 10.34 కోట్లతో మంజూరు చేసి ఇప్పటివరకు 143 రహదారులను పూర్తి స్థాయిలో నిర్మించగా, మిగిలిన రహదారి నిర్మాణాలను కూడా త్వరగా పూర్తిచేసి సంక్రాంతి పండుగ అనంతరం ప్రారంభోత్సవాలు చేసి పల్లెల్లో రహదారులను అందంగా తయారు చేస్తామన్నారు. తన నియోజకవర్గం లో రూ. 10.20 కోట్లతో నూతనంగా మరిన్ని సిమెంట్ రోడ్లను మంజూరు చేశామన్నారు. ప్రత్యేక కార్యాచరణతో సిమెంట్ రోడ్లను వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వ పరంగాచర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలోని 10 సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు రూ. 2.66 కోట్లతో పూర్తిస్థాయిలో అన్ని మౌలిక వసతులతో పునర్నిర్మాణం చేపట్టి దళిత విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కషి చేస్తున్నామన్నారు.

మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

ఉద్యోగులు ప్రత్యేకించి ప్రభుత్వ ఉపాధ్యాయుల విషయంలో కూటమి ప్రభుత్వం తప్పుచేస్తుందని పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాటకం తిరుమలయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నో ఇబ్బందులను చవిచూసి, సమయానికి జీతాలు రాక బ్యాంకులకు, సమయానికి కిస్తీలు కట్టలేక పరపతిని పోగొట్టుకొని, మార్పు కోరుకొని కోటిఆశలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేం దుకు ఉపాధ్యాయులు కీలక పాత్ర వహించారన్నారు. ఆ కారణంతోనే గత ప్రభుత్వం అధికారం కోల్పోయిందని విమర్శించారు.

మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

విద్యుత్ బస్సుల నిర్వహణ

ఆర్‌టిసికి అప్పగించాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యుత్ బస్సుల నిర్వహణ బాధ్యతను ఆర్‌టికే అప్పగించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలోని ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ డిప్యూటి జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రమణ్యం,ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడుతూ వాతావరణ కాలుష్య నివారణలో భాగంగా ప్రజా రవాణా నిమిత్తం ఆర్‌టిసి సంస్థలో ప్రయివేటు విద్యుత్ బస్సులను అందు బాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ప్రధాన మంత్రి ఈ బస్సు స్కీంలో జిల్లాకు 70 విద్యుత్తు బస్సులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ స్వాగతిస్తుందన్నారు. ఈ బస్సులను సంస్థ ఆధ్వర్యంలో నడపాలని తమ యూనియన్ డిమాండ్ చేస్తుందన్నారు. ఇప్పటికే తిరుపతి నుంచి వంద విద్యుత్తు బస్సులను ప్రయివేట్ వ్యక్తుల చేత ఆర్‌టిసి అద్దె చెల్లించి నడుపుతుందన్నారు. ఆ విధంగా కాకుండా విద్యుత్తు బస్సుల నిర్వహణ బాధ్యత పూర్తిగా ఆర్‌టిసి తీసుకోవాలన్నారు. ఈ విద్యుత్తు బస్సుల నిర్వహణ బాధ్యత ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల సిబ్బంది బాధ్యత సైతం ప్రయివేట్ వ్యక్తుల పరిధిలో ఉంటుందన్నారు.

నాలుగు వర్క షాపులు,129 డిపోలు, డ్రైవర్లు, మెకానిక్‌లు ఉన్నారని, వీరందరికి శిక్షణ ఇవ్వడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ విధంగా నిర్ణయం తీసుకోవడం వల్ల సంస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ సమస్యలన్నింటిపై ఈ నెల 7న విజయవాడ ప్రాంతంలో సదస్సు నిర్వహిస ్తున్నామన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.రాజశేఖర్, జోనల్ కార్యదర్శి ఎస్‌కె ఖాజావల్లి, జిల్లా ప్రచార కార్యదర్శి టి.దశరద ఉన్నారు.

నుడా ఛైర్మన్‌ను కలిసిన ఆటో కార్మికులు

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

గత ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు పూటగడవడమే కష్టంగా ఉండేదని.. పోలీసులు, రవాణా శాఖాధికారులు కేసులు రాసి వేధించేవారని.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా చర్యలు తీసు కున్నామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అన్నారు. ట్రాఫిక్ రూల్స్‌కు విరుద్ధంగా ఎవ్వరూ ప్రవర్తించొద్దదన్నారు. తెలుగునాడు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి కోటంరెడ్డి ఐడికార్డులు అందజేశారు. అనంతరం కోటంరెడ్డి మాట్లాడుతూ తెలుగునాడు ఆటో వర్కర్స్ యూనియర్ క్రమశిక్షణకు మారుపేరని కొనియాడారు. వారికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా తన దష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. దళిత ఆటోడ్రైవర్ల సుస్థిర ఆధాయ కల్పనే లక్ష్యంగా సిఎం చంద్రబాబు నాయుడు సబ్సిడి రూపంలో రాష్టంలోని ఆటో డ్రైవర్లకు 4074 ఆటోలను అందజేస్తున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు కువ్వారపు బాలాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోటంరెడ్డిని యూనియన్ నేతలు ఘనంగా సన్మా నించారు. కువ్వారపు బాలాజీ, నాగేంద్ర నగర అద్యక్షులు చప్పిడి వెంగయ్య, నగర కార్యదర్శి ప్రసన్న కుమార్, నగర కోశాధికారి అన్నం చంద్రశేఖర్, మునుస్వామి, శ్యామ్, మహేష్ పాల్గొన్నారు.

కిషోర్‌ని అభినందిస్తున్న దృశ్యం

పదవి హోదా కాదు.. బాధ్యత..

ప్రజాశక్తి-కందుకూరు :

సామాజిక న్యాయ సాధనలో భాగంగా వైసిపి నెల్లూరు జిల్లా కార్యవర్గంలో కందుకూరు నియోజకవర్గం నుంచి జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నికైన ముప్పవరపు కిషోర్‌ను మిత్రులు సన్నిహితులు ఘనంగా సన్మానిం చారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్ర మానికి జిల్లా ఇంటెలెక్చువల్ సంఘ అధ్యక్షులు రావుల కొల్లు బ్రహ్మానందం అధ్యక్షత వహించారు. సన్మానం సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచి ఇచ్చిన పదవి హోదా కాదని..బాధ్యత అన్నారు. సామాజిక న్యాయం అమలులో భాగంగా అవకాశం కల్పించిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా.మధుసూదన్ యాదవ్, జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి, అధినేత జగన్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇంటెలెక్చువల్ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల కొల్లు బ్రహ్మానందం, మాజీ కౌన్సిలర్ గేరా మనోహర్, మాజీ కౌన్సిలర్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు రేణమాల అయ్యన్న, సచివాలయం కన్వీనర్ చనమాల కోటేశ్వరరావు, పట్టణ సెక్రెటరీ ఉచ్చు లూరి రవీంద్ర, సచివాలయం కన్వీనర్ షేక్ రహీం,రైతు విభాగం నాయకులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు మహిళాసంఘం నాయకురాలు దేవరకొండ ఆదిలక్ష్మి తొలుత కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.

'ఆరోగ్య శ్రీ'ని నిలిపేయడం అన్యాయం

ప్రజాశక్తి-కావలి: ఆరోగ్యశ్రీ - ఇ.హెచ్.ఎస్. సేవలను సోమవారం నుండి బంద్ చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల సమాఖ్య విజయవాడలో జరిగిన సమావేశంలో ప్రకటించడం పేద బడుగు జీవులకు అశనిపాతం వంటిదని కావలి ఉమెన్స్ ఫోర్స్ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వాలు తమకు చెల్లించాల్సిన రూ.3వేలకోట్ల బకాయిలను చెల్లించమని అడిగితే బడ్జెట్ లేదంటున్నాయని, స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని, ఎన్‌టిఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌లను కొనసాగించలేమని వాటిని బంద్ చేయక తప్పదని శనివారం విజయవాడలో జరిగిన సమావేశంలో వెల్లడించారన్నారు. పేదబడుగు జీవుల అనారోగ్య సమస్యలను ఉచితంగా పరిష్కరించి, వారి జీవితాల్లో వెలుగు నింపాలని ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఈ పథకాలకు అయ్యే ఖర్చును ఆయా వైద్యశాలలకు ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. కానీ గత - ప్రస్తుత ప్రభుత్వాలు ఈ చెల్లింపులపై నిర్లక్ష్యం వహించడం విచారకరమని, వారి తొందరపాటు నిర్ణయాన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు వెనక్కు తీసుకునేలా, ఎన్‌టిఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) బకాయిలను చెల్లించి, ప్రస్తుత ప్రభుత్వం ఈ ఉచిత వైద్యసేవలు కొనసాగేలా తక్షణ చర్యలు తీసుకుని, పేదల పక్షాన నిలబడి న్యాయం చెయ్యాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సి.శారద (కన్వీనర్), షేక్.ఫాతిమా, టి.సుజాత, బుష్రా, అరుణ, విద్యావతి కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు శాఖ గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం కార్యక్రమం విద్యార్థులతో జరిపారు. విద్యార్థులతో నీతి కథలు ,దేశ నాయకులు కథలు చదివించడం జరిగినది. విద్యార్థులు ప్రతి ఆదివారం తప్పనిసరిగా గ్రంధాలయానికి రావాలని పుస్తక పఠనం చేయడం వలన జ్ఞాన అభివద్ధి పెంపొందించుకోవచ్చునని గ్రంధపాలకురాలు తెలిపారు. పుస్తక పఠనంతో జ్ఞానం పెరుగుతుందన్నారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు షైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రెసిడెంట్ రహీమ్ మాట్లాడారు. ఫౌండేషన్ ప్రతినిధులు సుల్తాన్, రసూల్, డాక్టర్ రాయ్, నయీమ్ భాష, ఉన్నారు.శ్రీ కరుణ అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు జి కొండయ్య ,సెక్రటరీ కరుణాకర్ జగన్ కలిసి ఆదివారం ప్రతి చర్చిలు, దేవాలయాల వద్దనున్న పేదలకు భోజన ప్యాకెట్లు అందజేశారు. జెడిబియం టౌన్ బాప్టిస్ట్ చర్చ్ జాయింట్ ట్రెజరీ కొండేటి కరుణాకర్ సహకారం అందించారు.

దోమ తెరలు అందజేత

ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ప్రీమిసెస్‌లో, కావలి రెడ్‌క్రాస్ భవన్ పక్కన ఉన్న ప్రభుత్వ ఎస్.సి. బాలికల హాస్టల్‌లో పెంచల నరసింహారెడ్డి, వారి మిత్రబృందం సహాయ సహకారంతో విద్యార్థినులకు 45 దోమతెరలు, 10 దుప్పట్లు అందజేశారు. విద్యార్థులు ఈ శీతాకాలంలో వాటిని చక్కగా ఉపయోగించుకొని, బాగా చదువుకొని, మంచి మార్క్స్‌తో ఉత్తీర్ణత సాధించాలన్నారు. తద్వారా తమకు, తమ తల్లి దండ్రులకు, పాఠశాలకు, ఈ ప్రభుత్వ వసతి గృహానికి మంచిపేరు ప్రతిష్టలు తేవాల న్నారు. విద్యారుధ్దలకు ఉజ్వల భవిష్యత్ కలగాలని అభిలాషించారు. కార్యక్ర మంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు పెంచల నరసింహారెడ్డి, సి.హెచ్ .సుధాకర్ (రిటైర్డ్ హెడ్ మాస్టర్), వై.మాల్యాద్రి (హెడ్ మాస్టర్- ఇన్‌ఛార్జ్), సి.వి. ఆంజనేయులు, జి.శ్రీనివాసరావు, ఎం.వి. రమణయ్య, జి.హరనాథ్, హాస్టల్ వార్డెన్స్, విద్యార్థినీలు ం పాల్గొన్నారు.

దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

సిపిఎం రాష్ట్ర మహాసభల జయప్రదం కోరుతూ

ఇంటింటా విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-నెల్లూరు

సిపిఎం రాష్ట్ర 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నగరంలోని 54వ డివిజన్ పరిధిలోని జనార్దన్ రెడ్డి కాలనీ నందు సిపిఎంకార్యకర్తలు 5 దళాలుగా ఏర్పడి ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఈ ప్రచారకార్యక్రమాన్ని సిపిఎంజిల్లా కార్యదర్శి మూలం రమేష్ జనార్దన్ రెడ్డి కాలనీ, మసీదు సెంటర్ వద్ద అన్ని దళ సభ్యులకు రెడ్ టవలు మెడలో వేసి ప్రతి కార్యకర్తకు ఎర్రజెండా చేతికిచ్చి ఈ దళాలను జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర 27వ రాష్ట్ర మహాసభలో దాదాపు 46 సంవత్సరాలు తర్వాత నగరంలో జరుగుతున్నాయని కార్మిక కర్షక ప్రజలు ఎదుర్కొనేటటువంటి సమస్యల మీద ఈ మహాసభలలో చర్చించి భవిష్యత్తు పోరాటాలను నిర్వహించేందుకు ఈ మహాసభలు ఉపయోగపడతాయని, ఈ మహాసభలకు ప్రజల నుండి అనూహమైన స్పందన వస్తుందని ప్రజలు మా భుజం తట్టి మాకు సహకరిస్తున్నారని ప్రజల సహకారం మాకు ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఈ మహాసభల చివరి రోజు ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3-00 గంటలకు ఆత్మకూరు బస్టాండ్ వద్ద నుండి భారీ ర్యాలీ అనంతరం వి ఆర్ సి గ్రౌండ్ లో జరుగు బహిరంగ సభను కార్మికులు కర్షకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగేశ్వర రావు, షేక్ మస్తాన్ బి, నగర కమిటీ సభ్యులు మూలం. ప్రసాద్, షేక్ జాఫర్ నాయకులు కరీముల్లా, ఆర్టీసీ బాబు, సురేష్, షేక్ షాహిన్, రసూల్, సమీవుల్లా, ఖాదర్ ఖాన్, పి కష్ణ,మూలే.సీనయ్య, ఖాజావలి భాగ్యమ్మ కామెల సల్మా తదితరులు పాల్గొన్నారు

వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యురాలు

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఉలవపాడు

ఉలవపాడు మండలం అలగాయపాలెం గ్రామంలో సరయు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఉలవపాడు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశాల జీవనం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టరు రాజేష్, అప్పిరెట్ల జనరల్ డయాబెటిక్ ఎమర్జెన్సీ వైద్య నిపుణులు, డాక్టరు సుస్మిత జోరపల్లి, కాన్పులు, గర్భకోశ వ్యాధి నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి తగు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టరు రాజేష్ మాట్లాడుతూ మండల పరిధిలో మారుమూల గ్రామాలలో ప్రతి నెలలో రెండుసార్లు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందజేస్తామన్నారు. శిబిరంలో బిపి, షుగర్, ఇ.సి.జి. పరీక్షలు ఉచితంగా నిర్వహించి వందమంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

సావిత్రిబాయి పూలేకు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీ బాయిపూల జయంతి వేడుకలు కందుకూరు కాలేజీ బాలికల బీసి హాస్టల్‌లో బహుజన టీచర్స్ అసోసి యేషన్ (బి టి ఏ)ఆధ్వర్యంలో ఆదివారం జరిగాయి. బిటిఎ జిల్లా మహిళ కార్యదర్శి ఏ అరుణ కుమారి మాట్లాడారు. సావిత్రీబాయిపూలే స్త్రీ హక్కుల కోసం మహిళా విద్య కోసం విశేషంగాచేసిన కృషి చేశారన్నారు. ఇంకా డివిజన్ మహిళా కార్యదర్శి సుభాషిని, సీనియర్ ఉపాధ్యాయుని షర్మిల, వాణి సుబ్బరత్నం మాట్లాడారు. అనంతరం హాస్టల్లో చదువుకుం టున్న విద్యార్థులకు కందుకూరు బాలికలు ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న సమత విద్యార్థులకు ప్యాడ్స్ స్వీట్స్ పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులు సమతను హాస్టల్ హెచ్ డబ్ల్యు ఓ హుస్సేనీ సన్మానించారు.హెచ్ డబ్ల్యు ఓ మునంగి రమేష్ ,మహిళా కార్యదర్శులు మంగమ్మ , కవిత ,సుకన్య ,డివిజన్ అధ్యక్షులు అబ్దుల్లా, కరేటి వెంకటేశ్వర్లు, మోహన్ రావు పాల్గొన్నారు.

'రాళ్లపాడు' గేటు మరమ్మతులలో

మనోహర్ కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి - లింగసముద్రం

రాళ్లపాడు గేటు మరమ్మతుల పనుల్లో టిడిపి నాయకులు సోంపల్లి మనోహర్ కీలకంగా పనిచేశారు. ఇటీవల రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూములో ఏర్పడిన సమస్య వల్ల ఆయకట్టు పరిధిలో వరి సాగు చేసే రైతులు ఇబ్బందులు పడ్డారు. కుడికాలువ నుంచి నీటిని విడుదల చేసేందుకు అంతరాయం ఏర్పడింది. దీంతో సమస్యను పరిష్కరించి నీటిని కాలువకు విడుదల చేయాలని అధికారులు పనులు ప్రారంభించి అనేక ప్రయత్నాలు చేశారు.ఆ సమయంలో ప్రాజెక్టు దగ్గరకు వెళ్లి అధికారులు చేస్తున్న పనులను పర్యవేక్షించి వారికి సహకరించాలని ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు చినపవని గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సోంపల్లి మనోహర్‌కు చెప్పారు. ఎంఎల్‌ఎ ఆదేశాలతో మనోహర్ 20 రోజులు పాటు ప్రాజెక్టు వద్దనే ఉండి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలిస్తూ వారికి అండగా నిలిచారు.ప్రతిరోజు ప్రాజెక్టు వద్దకు వచ్చి పనులను త్వరగా పూర్తిచేసి రైతులకు నీటిని అందించేలా పనులు చేయాలని అధికారులకు అన్ని విధాలుగా తోడుగా నిలిచారు. అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ బయట ప్రాంతాల నుంచి వచ్చిన నిపుణు లతో, సిబ్బందితో చర్చిస్తూ గేటు సమస్యను పరిష్కరించడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయనతోపాటు మండల తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య మరికొందరు టిడిపి నాయకులు ప్రాజెక్టు వద్ద ఉంటూ అధికారులకు అవసరమైన పరికరాలను, వస్తువులను తీసుకువచ్చి సహకరించారు. ఎట్టకేలకు వారి ప్రయత్నాలు ఫలించడంతో తూము ద్వారనే నీటిని విడుదల చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడంలో మనోహర్ కీలకంగా వ్యవహరించారు.ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు, ప్రాజెక్టు అధికారులు,సిబ్బంది సోంపల్లి మనోహర్ కు అభినందనలు తెలిపారు.

ప్రాజెక్ట్ అధికారులతో మనోహర్

విద్యుత్‌షాక్‌తో పూరిగుడిసెలు దగ్ధం

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని విడవలూరు అన్నారెడ్డిపాలెం పంచాయతీలోని గిరిజన కాలనీలో శనివారం కరెంట్ షాక్ సర్క్యూట్ వల్ల గడ్డం చెంచమ్మ, గడ్డం బ్రహ్మయ్య, గడ్డం ఏడుకొండలుకు సంబంధించిన గుడిసెలు కాలిపోయాయి. ఆదివారం ఏపి గిరిజనుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ, ఏపి గిరిజన గురుకులాలు, ట్రైబుల్ వెల్ఫేర్ హాస్టల్స్ రాష్ట్ర సమితి ఆ ప్రాంతాన్ని సందర్శించి అసలు గుడిసెలు కాలిపోవడానికి ప్రధాన కారణాలను పరిశీలించారు. కరెంటు షార్ట్ సర్క్యూట్ వల్ల పూరి ఇండ్లు రేషన్, ఆధార్‌కార్డులు కూడా కాలిపోగా కొంత నగదు వంట సామాగ్రి నిత్యవసర సరుకులు అన్నీ కూడా ఉగ్గిపాలయ్యాయని బాధితులు లబోదిబోమన్నారు. బృందం వారందరికీ ధైర్యం చెప్పి ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్ట పరిహారాన్ని జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఓలతో మాట్లాడి ఇస్తామని తెలిపారు. అలానే స్థానిక విఆర్‌ఓ కూడా వచ్చి నివేదిక సమర్పించాలని అలానే హౌసింగ్ బోర్డ్ వారు కూడా వచ్చి కాలిపోయిన ఇళ్లకు పక్కా గృహాలు నిర్మించే చర్యలు చేపట్టాలని బృందం కోరింది. కొన్ని నిత్యావసరాల సరుకులు కట్టుకునేందుకు దుస్తులు పంతగిరి వెంకటేశ్వర్లు, మాణిక్యాల అనూష ఆర్థికసాయంతో వారికి అందించారు. అనంతరం పక్కనే ఉన్న గుడిసెల కాలనీని పరిశీలించగా వారందరూ కూడా దాదాపు 20ఇళ్లల్లో నివాసానికి యోగ్యత లేకుండా నివసిస్తున్నారని వారందరూ కూడా తమకు పట్టాలిప్పించి పక్కా గృహాలు నిర్మించాలని బృందం దృష్టికి తెలిపారు. స్పందించిన బృందం స్థానిక ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డితో మాట్లాడి వాళ్ళ తరపున పక్కా గృహాలు కట్టే ఏర్పాటు కూడా చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎపి గిరిజన గురుకులాలు, ట్రైబుల్ వెల్ఫేర్ హాస్టల్స్ రాష్ట్ర అధ్యక్షులు డిఎల్ శేఖర్, ఆంధ్రప్రదేశ్ గిరిజనుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చౌటూరు సీనయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఏలూరు బుచ్చయ్య, జిల్లా కమిటీ సభ్యులు నందిగం సాయి, పంతగిరి వెంకటేశ్వర్లు, మాణికల సుబ్రహ్మణ్యం, మాలికల అనూష, ఎంపిటిసి కుడుముల మోహన్, వార్డుమెంబర్ అనగాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఎంఎల్ఎ ఆర్థికసాయం :

మండలంలోని అన్నారెడ్డిపాలెంలో గిరిజన కాలనీలో కరెంట్ షాక్‌తో శనివారం పూరిల్లు మంటలతో కాలిపోయిందన్న సమాచారం తెలుసుకున్న ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి టిడిపి నాయకులు శ్రీధర్ రెడ్డి ద్వారా బాధితులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అందుకుగానూ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎంఎల్ఎకు ధన్యవాదాలు తెలియజేశారు.

నీళ్లట్యాంక్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణంలో నీటి సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ ముత్తుజా హుస్సేన్ ఆదేశాలతో ఇఒపిఆర్‌డి కరిముల్లా సూచనలతో వార్డ్‌మెంబర్ ఉప్పుటూరు శీను ఆధ్వర్యంలో సిబ్బంది శరవేగంగా మరమ్మతులను చేపట్టారు. ఆదివారం స్థానిక వాల్మీకి వీధి, బోయవీధిలోని మంచినీళ్ల ట్యాంక్ కొత్తవాలు తదితర మరమ్మతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు స్థానికులు వారికి అభినందనలు తెలిపారు. మాజీ ఎంపిటిసి ఉప్పుటూరు హరి, నాయకులు రియాజ్, సిబ్బంది తిమ్మయ్య, గురవయ్య పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : విక్రమ సింహపురి యూనివర్సిటీ కావలి కళాశాలలో "కావలి జోన్ క్రికెట్ టోర్నమెంట్"ను ఆదివారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శైలజ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ క్రీడలు అనేవి ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడుతాయన్నారు. అలాగే ఓటమిలో కూడా కుంగిపోకుండా విజయాన్ని ఎలా చేరుకోవాలని నేర్పిస్తుందన్నారు. యూనివర్శిటీకి మంచి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని కొనియాడారు. ఈ టోర్నమెంట్లో మొదటగా శ్రీ సాయి కళాశాల జట్టు, శ్రీ చైతన్య కళాశాల తలపడగా శ్రీ చైతన్య కళాశాల జట్టు విజయం సాధించింది. విక్రమ సింహపురి యూనివర్సిటీ కావలి జట్టు, శ్రీ చైతన్య కళాశాల జట్టు తలపడగా విక్రమసింహపురి కళాశాల కావలి జట్టు విజయం సాధించాయి. టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.హెచ్. మణికంఠ, పిడిలు శ్రీనివాసులు, తిరుపాలు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వీరేంద్ర జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ళ వీరేంద్ర చౌదరి జన్మదిన వేడుకలను ఆదివారం టిడిపి నాయకులు, అభిమానులు కొరుటూరులోని ఆయన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో మొత్తలు సెంటర్ నుండి కొరుటూరు వరకు వీరేంద్ర చౌదరి అభిమానులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గజమాలతో ఆయనను సత్కరించి, భారీ కేక్ కట్ చేశారు. ఈ వేడుకతో కొరుటూరులో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ ఇంత ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు .అందరికీ ఎప్పుడు రుణపడి ఉంటానని, ఏ సమస్య వచ్చినా ముందుండి కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో బట్టేపాటి సురేష్ నాయుడు, గంపల అనిల్, ఈదురు చెన్నయ్య, తన్నీరు మధు, బండ్ల ఉదయ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

హనుమంతరావు వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో భీమ్ హనుమంతరావు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆదరణ కేంద్రంలో అనాథలకు భోజనం, దుస్తులు, నిత్యావసర వస్తువులు హనుమంతరావు కుమారుడు శివకుమార్ కోడలు వనజ అందజేశారు. ఈ సందర్భంగా ఆదరణకేంద్రం డైరెక్టర్ కట్టిపల్లి సింహాద్రిరావు మాట్లాడుతూ హనుమంతరావు వర్ధంతి సందర్భంగా వారి కుటుంబసభ్యులు ఆదరణ కేంద్రంలోని అనాథలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సాయితేజ, వనిత, సుమంత్, మానస, హనుమంతరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-బిట్రగుంట : సూర్యోదయానికి ముందే ప్రతి ఒక్కరూ నిద్ర లేచి, అరగంట పాటు వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు పేర్కొన్నారు. బిట్రగుంట వాకర్ అసోసియేషన్ క్రీడా మైదానంలో ఆదివారం ముఖేష్ కుమార్ ఏర్పాటు చేసిన ట్రీట్‌లో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్జన్ రాజ్, బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ కుందుర్తి శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బోయపాటి సుధాకర్ నాయుడు, పి.జీవన్ కుమార్, జిలాని, జనార్దన్, సత్యం, మురళి, శేఖర్ బాబు, శ్యామ్‌సుందర్, రమణారెడ్డి, సీనియర్ జర్నలిస్టు వెంకటేశ్వర్లు, ఏనుగుల ప్రభాకర్ రెడ్డి, సుబ్బరాయుడు, ప్రభావతి, ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్‌లు గోపిశెట్టి శ్రీహరిబాబు, మనోహర్ నాయుడు, రాజన్, రషీద్, బత్తుల రవి, బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, రైల్వే విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలలు అప్పగింత

ప్రజాశక్తి-విడవలూరు : డిసెంబర్ 31వ తేదీ రాత్రి నుండి కనపడకుండా పోయిన ఇద్దరు చిన్నపిల్లలను విడవలూరు ఎస్ఐ పి.నరేష్ ఆదివారం కోట మండలంలోని శ్రీనివాస సత్రం అనే గ్రామంలో వాళ్ల మేనత్త వద్ద ఉన్నట్లు గుర్తించి వారిని క్షేమంగా తీసుకొచ్చి వాళ్ళ తల్లిదండ్రులకు అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ఊటుకూరు గ్రామంలో ఉదయం 8 గంటల నుంచి పిల్లలు ఆడుకుంటూ కనిపించకుండా పోయారని వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా ఈ కేసును చాకచక్యంగా కనుగొన్నందుకు జిల్లా ఎస్‌పి, డి.ఎస్.పి., సిఐ సూచనలు ఆదేశాలు అభినందిస్తూ తప్పిపోయిన చిన్నారులను తక్కువ సమయంలో పట్టుకొని వారి తల్లిదండ్రులకు అప్పగించినందుకు ఉన్నతాధికారులు అభినందించి ప్రశంసించారు. ఈ కేసులో ఎస్ఐతో పాటు తన సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాల పోరు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీలో తెలుగుదేశంలో ఇరువర్గాల పోరు రోజురోజుకు రాజుకుంటోంది. ఎన్నికల అనంతరం అనేకసార్లు ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం పడడం, దానికి సంబంధించి ఇటీవల జరిగిన అభినందన సన్మాన సభలో కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇరువర్గాలు కలిసి పోవాలని, ఈ విధంగా ఉంటే పార్టీకి ఇబ్బంది అని చురకలు కూడా వేశారు. అయినా కూడా ఇరువర్గాల్లో ఎటువంటి మార్పు రాకపోవడం గమనార్హం. తాజాగా చంద్రమౌళి నగరుకు చెందిన టిడిపి వర్గీయులు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డిలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పడుగుపాడు ప్రాంతంలో పెద్దఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీని శనివారం అర్ధరాత్రి మరోవర్గం చించివేసింది. ఈ మేరకు చంద్రమౌళినగర్‌కు చెందిన వై.సుగుణమ్మ దానిని సంబంధించి ఆదివారం కోవూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. తాము సమ్మయనం పాటిస్తున్న ఆ వర్గీయులు తమను ఇబ్బందులు పెడుతూనే ఉన్నారని, ఈ విషయాన్ని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్తామని ఆమె పేర్కొన్నారు.

నాణ్యత ప్రమాణాలను పాటించాలి

కార్పొరేషన్ ఆరోగ్యశాఖాధికారి చైతన్య

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని కొన్ని హోటల్స్‌కు, రెస్టారెంట్లకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉంది. నగరానికి రకరకాల పనుల నిమిత్తం వచ్చిన ప్రజానీకం తమ పనులు పూర్తి చేసుకొని ఇంటికి తిరుగు పయనమయ్యే సమయంలో ఆకలి తీర్చుకొనేందుకు తమ స్థాయికి తగిన విధంగా హోటల్స్‌కు, రెస్టారెంట్లకు చేరుకొని భోజనం చేసి వెళ్లే వారు అనేకమంది ఉన్నారు. అయితే ఇటీవల కాలంలో అటువంటి హోటల్స్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాల్లో విషపూరితమైన ప్రాణులు చనిపోయి ఉన్న కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. అటువంటి హోటల్స్‌పై ఎటువంటి చర్యలు తీసుకున్నారో ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య మాటల్లో...



ప్రశ్న. ఇటీవల నగరంలోని కొన్ని హోటల్స్‌లో ఆహార పదార్థాలు తయారు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదని భోజన ప్రియులు విమర్శలు చేస్తున్నారు. దానిపై మీ స్పందన ఏమిటీ..?

జవాబు. ఇటీవల కాలంలో ఆహార నాణ్యతపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నగరంలోని ఆచారి వీధిలోని రియాజ్ బిర్యానీ హోటల్‌ను ఆకస్మిక తనిఖీలు చేశాం. తనిఖీల్లో భాగంగా వంటశాల, స్టోర్ రూములో కార్పొరేషన్ ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రమాణాలను పాటించడం లేదని గుర్తించాం. వీరిపై ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

ప్రశ్న. నగర, రూరల్ నియోజకవర్గ పరిధిలో చెత్త సేకరణ సక్రమంగా జరగటం లేదని, చెత్త సేకరణకు వాహనాలు వచ్చి సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డు వరకు తరలించే క్రమంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో చెత్త కొంత మేరకు రహదారులపైన పడిపోతుందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ సమస్య మీ దృష్టికి వచ్చిందా... నివారణకుఎటువంటి చర్యలు తీసుకున్నారు..?

జవాబు. నేను కార్పొరేషన్ పరిధిలో ఆరోగ్య శాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ సమస్యపై పలు ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమే. ప్రతి నిత్యం డివిజనల్లో పర్యటించి చెత్త సేకరణ వాహనాలు వచ్చి వ్యర్థాలు సేకరిస్తున్నది, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాయా.. లేదా తనిఖీలు చేపట్టాం. ఇటీవల స్థానిక అల్లీపురం ప్రాంతంలోని డంపింగ్ యార్డును పరిశీలించాం. ఆ సమయంలో యార్డు లోపల వరకు చెత్త సేకరణ వాహనాలు వెళ్లకుండా గేటు సమీపంలోనే వ్యర్థాలు వేస్తున్నది గమనించి, ఇలాంటి విధానం సరికాదని సిబ్బందిని హెచ్చరించారు. తడి, పొడి చెత్తను తప్పని సరిగా విడివిడిగా సేకరించి డంపింగ్ కూడా విడివిడిగా చేయాలని ఆదేశించారు. కార్యాల యంలోని సంబంధిత విభాగం అధికారుల కు తెలియజేశారు. అనంతరం డంపింగ్ యార్డు పక్కన నిర్మించిన స్క్రాప్ షెడ్‌ను పరిశీలించి, వారు నగరపాలక సంస్థ ద్వారా ట్రేడ్ లైసెన్సు పొందారా.. లేదా.. అన్నది పరిశీలించాం.

ప్రశ్న. రహదారులపై పశువులు సంచారం చేస్తూ వాహన ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కొన్ని సమయాల్లో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. నగరంలో కూరగాయల మార్కెట్ సమీపంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. ప్రధాన రోడ్లపై వాహనదారులకు అడ్డంకిగా మారిన పశువులపై వాటి యజమానులు బాధ్యత వహించకపోతే కఠిన చర్యలు తప్పవని, వాటిని గోశాలకు తరలిస్తామని నగరపాలక సంస్థ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కమిషనర్ సూర్యతేజల ఆదేశాల మేరకు సంచార పశువులను గోశాలకు తరలించే స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వెటర్నరీ వైద్యుని నేతృత్వంలో రెండు బృందాలు స్థానిక ఆర్‌టిసి బస్టాండ్, పాత మున్సిపల్ కార్యాలయం రోడ్డు, కూరగాయలు మార్కెట్ ప్రాంతాల్లో రోడ్లపై సంచరి స్తున్న 8 పశువులను కల్లూరు పల్లి గోశాలకు తరలించే ఏర్పాటు చేశాం. వాహన ప్రమాదాలకు కారణమవు తున్న రోడ్లపై సంచరించే పశువులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. పశువులను గోశాలకు తరలించి వాటి సంరక్షణ బాధ్యత లను నగరపాలక సంస్థ ప్రత్యక్షంగా పర్యవేక్షి స్తుంది. పశువులను యజమానులు వాళ్ల ప్రాంగణాల్లోనే ఉంచుకోవాలని, రోడ్లపై వదిలితే తప్పని సరిగా వాటిని గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌ను నగర వ్యాప్తంగా ప్రతిరోజూ నిర్వ హించి సంచార పశువులను తరలిస్తామని ఉత్తర్వులు జారీ చేశాం. ఈ కార్యక్రమాలన్ని వెటర్నరీ వైద్యుల సహకారంతోనే నిర్వహిస్తున్నాం.

నిందితుడిపై పోలీసుల చర్యలేవి..?

- ప్రెస్‌క్లబ్‌లో దళిత మహిళ ఆవేదన

ప్రజాశక్తి-కావలి : తనను వేధింపులకు గురి చేస్తున్న పాపన బోయిన మల్లికార్జున రెడ్డిపై పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని దగదర్తి మండలం, సిద్ధారెడ్డిపాలెంకు చెందిన దళిత మహిళ రావూరు వెంకటరమణమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఆదివారం పట్టణంలోని "జర్నలిస్టు క్లబ్"లో ఆమె ఇంటర్‌నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు గాలి వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు దానం మాల్యాద్రిలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించింది. అనంతరం ఆమె మాట్లాడుతూ దగదర్తి మండలం చెన్నూరు పంచాయతీ సిద్ధారెడ్డి పాలెం గ్రామంకు చెందిన తాను 2012 నుంచి (విఒఎ) విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నానని, తమ పంచాయతీ పరిధిలోని తిమ్మారెడ్డిపాళెంకు చెందిన పాపానబోయిన మల్లికార్జున రెడ్డి గత కొద్ది రోజులుగా తనకు వీడియోకాల్స్, వాట్సప్‌కాల్స్ చేస్తూ మానసికంగా, శారీరకంగా వేధిస్తూ తన కోరికలను తీర్చాలంటూ వేధిస్తున్నారని ఆమె వాపోయింది. అయితే జరిగిన విషయాన్ని పెద్దలతో చర్చించి, జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశానని తెలిపారు. అలానే పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేస్తే, డిసెంబర్ 28న ఎఫ్ఐఆర్ చేసి, అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పుడు కూడా అతను తనను కారు, బండి అడ్డంపెట్టి కులంపేరుతో కూడా దూషిస్తూ వేధించాడని తెలిపారు. అతని వల్ల తనకు ప్రాణహాని ఉందని అధికారులు స్పందించి, తక్షణమే తనకు న్యాయం చేయకపోతే సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌లను కలిసి తనబాధను విన్నవించుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో రాము, తదితరులు పాల్గొన్నారు.

మేకపాటిని కలిసిన డాక్టర్ ఆదిశేషయ్య

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డిని వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు, మాజీ జెడ్‌పిటిసి డాక్టర్ ఆదిశేషయ్య నెల్లూరులోని మేకపాటి నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని శాలువాలతో సత్కరించి పూలబొకేను అందజేశారు. తనను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షునిగా నియమించడంలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించడంతో, పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనవెంట వైసిపి పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, నోటి వినయ్‌కుమార్ రడ్డి, చిల్లూరు వెంకటేశ్వర్లు, బాల అంకయ్య తదితరులున్నారు.

'జలప్రభ' లబ్ధిదారులతో సమావేశం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని అనుమసముద్రం గ్రామంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా అభివృద్ధి చేసిన ఇందిర జల ప్రభ పథకంలో 240 ఎకరాల మామిడి మొక్కల బ్లాక్‌ను వన్ మెన్ కమిషన్ చైర్మన్ రాజురంజన్ మిశ్రా లబ్ధిదారులతో సమావేశమై, అక్కడి మామిడి తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ బి.పావని, పిడి ఎంఐపి శ్రీనివాసులు, ఎపి డి శంకర్ నారాయణ, ఎంపిడిఒ పి ప్రసన్నకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అన్నవరంలో విష జ్వరాల్లేవ్..

- గట్టుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ జె.పద్మజ

ప్రజాశక్తి-జలదంకి

వైద్యం నిర్వహిస్తున్న డాక్టర్లు

అన్నవరంలో విష జ్వరాలు లేవని అంతా ప్రచారమే అని గట్టుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ జె.పద్మజ పేర్కొన్నారు. ఆదివారం ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించిన వైద్య సిబ్బంది గ్రామమంతా పరిశీలించారు. గ్రామస్తులతో సమీక్షలు నిర్వహించిన అనంతరం వాస్తవంగా ఇక్కడ జ్వరాలు లేవని కొన్ని ఎలక్ట్రానిక్ మీడియాలు అవాస్తవాన్ని ప్రచారం చేయడంవల్ల గందరగోళం నెలకొందన్నారు. అయితే ఇక్కడ స్థానికులు సాధారణ జ్వరాలతో ఇబ్బందులు పడడం వాస్తవమే అన్నారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించి శానిటైజేషన్ కూడా చేపట్టామని పేర్కొన్నారు. వివిధ దిన పత్రికలలో వచ్చిన వార్తను అనుసరించి గట్టుపల్లి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.పద్మజ తన వైద్య బృందం అందరూ, జిల్లా సహాయ మలేరియా అధికారి, సబ్ యూనిట్ ఆఫీసర్ అందరూ కలిసి మెడికల్ క్యాంపు నిర్వహించి శానిటైజేషన్ చేయించామన్నారు. లార్వా సర్వే, ఫీవర్ సర్వే, యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేయించామన్నారు. వాటర్ శాంపిల్ టెస్టింగ్ నిర్వహించామన్నారు. ఆదివారం 133 మందికి వైద్య సేవలు, అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. డెంగీ, మలేరియా జ్వరాలు లేవని నిర్ధారణ చేశామన్నారు. ఇదేవిధంగా పూర్తిగా జ్వరాలు అదుపు వచ్చేవరకు వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, సబ్ యూనిట్ ఆఫీసర్, సూపర్‌వైజర్‌లు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'గండికోట'కు క్రాంతిరత్న పురస్కారం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించడమే కాకుండా, పుస్తక మిత్ర గ్రంథాలయాన్ని స్థాపించి ప్రతిరోజు విద్యార్థులకు పుస్తకాలపై ఆసక్తి కలగజేస్తూ, సాహిత్యాభిలాష పెంపొందిస్తున్న బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్‌కు క్రాంతిరత్న పురస్కారం అందజేశారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో తెలుగు సాంస్కృతిక సేవాసంస్థ గండికోటకు అందజేసి అభినందించారు. అనంతరం జాతీయ కవి సమ్మేళనంలో కవితా గానం చేశారు. 35వ పుస్తక మహోత్సవంలో ముఖ్య అతిథిగా గండికోట పాల్గొని పుస్తకాలు మనస్సుకు హాయినిస్తాయని, ఆలోచింపజేస్తాయని, సృజన పెంచుతాయని, ఊహ, వికసిత శక్తికి మార్గాలని పిల్లలకు తెలియజేశారు. క్రాంతిరత్న పురస్కారం అందుకున్న గండికోటను ఎంఇఒ దిలీప్‌కుమార్, రత్నంతో పాటు పలువురు అభినందించారు.

క్రీడాకారులకు సహకారం అందిస్తా..

ప్రజాశక్తి-కావలి

బ్యాటింగ్ చేస్తున్న ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి

క్రీడాకారులకు తన వంతు సహకారం అందిస్తానని, యువత క్రీడల వైపు ఆసక్తి చూపాలని ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని మినీస్టేడియంలో కావలి స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కావలి నియోజకవర్గ, జలదంకి మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్"ను ఆయన ప్రారంభించారు. స్టేడియంకు విచ్చేసిన ఆయనకు టోర్నమెంట్ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. సరదాగా కాసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. టాస్ వేసి ఆటను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ త్వరలో మినీ స్టేడియంకు మహర్దశ పట్టనుందని తెలిపారు. శాప్ అధికారులు రావడం జరిగిందని, స్టేడియంకు అవసరమైన పనుల కోసం డిపిఆర్, తయారు చేయడం జరిగిందన్నారు. స్టేడియంను చదును చేయడానికి, అవసరమైన మట్టి తోలకాలకు సంబంధించిన ఖర్చులు తాను భరిస్తానన్నారు. వాకర్స్‌కు ఇబ్బందులు తలెత్తకుండా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని తెలిపారు. ఎక్కడచెమట చిందుతుందో అక్కడ విజయం దరిచేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు పొట్లూరు శ్రీనివాసులు, సురే మదన్‌మోహన్ రెడ్డి, సిద్ధు, బుర్లా శ్రీధర్ రెడ్డి, దేవరకొండ శ్రీను, ఆళ్ళ శ్రీను, విక్రమ్ రెడ్డి, మొగిలి కల్లయ్య, కుందుర్తి కిరణ్, రఫీ, దామా మాల్యాద్రి, గంగినేని వెంకటేశ్వర్లు, శానం హరి, జనిగర్ల మనోహర్, పులిమి రామిరెడ్డి, క్రీడాకారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీ నారాయణకు నివాళులు

ప్రజాశక్తి-కొడవలూరు

ప్రజా నాట్య మండలి కళాకారుడు కాకి లక్ష్మీ నారాయణ మృతికి ఆదివారం సిపిఎం నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత గోనె దయాకర్ మాట్లాడుతూ మండలంలోని యల్లాయపాళెం గ్రామంలో కాకి లక్ష్మీ నారాయణ 1970 సంవత్సరం నుండి పార్టీ స్థాపించిన నాటి నుండి ప్రజానాట్య మండలి కళాకారుడిగా అనేక పోరాటాలలో గ్రామాల్లో ప్రజా ఉద్యమాలలో పాల్గొని ప్రజల్ని కళారూపాలు ద్వారా ఉత్తేజ పరిచేవారన్నారు. యల్లాయపాళెం ఉద్యమంలో 1975లో నాయకులు జైలుకెళ్లినప్పుడు గ్రామస్తు లకు తోడుగా లక్ష్మీనారాయణ గ్రామంలోని నాటికలు పాటలు శిక్షణ జరిపి ఆడించేవారని తెలిపారు. జిల్లాలోని అనేక గ్రామాలలో పార్టీ పిలుపుమేరకు కళారూపాల కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించి ప్రజా పోరాటాలను జయప్రదం చేసేవారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని, వారి కుటుంబానికి పార్టీ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అల్లాడి గోపాల్, సోమవరపు వెంకన్న, గండవరపు శేషయ్య, భూలోకం కాంతారావు, నరసయ్య, దేవకుమారి, యానాదయ్య, తల్లు శ్రీనివాసులు, అశోక్, శివయ్య, చిట్టిబాబు, పరశురాము, మాబూబాషా, తదితరులున్నారు.

అసోసియేషన్ అధ్యక్షులకు సన్మానం

ప్రజాశక్తి-కోవూరు

రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులుగా గెలిచిన వై.విజయశంకర్‌రెడ్డిని జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన ఇనమడుగు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఐ.రమేష బాబును ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. నెల్లూరు జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గంలో వై.విజయశంకర్‌రెడ్డి, రమేష్‌బాబుకు ప్రాతినిధ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా పుష్పగుచ్ఛంతో అభినందించారు.

సిపిఎం మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఉదయగిరి



నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరిగే సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలకు నాయకులు, అభిమానులు అధికంగా తరలి రావాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని బిజ్జంపల్లి ఎస్‌సి కాలనీ, జి.అయ్యవారిపల్లి ఇంటింటి ప్రచారంలో సిపిఎం రాష్ట్రం 27వ రాష్ట్ర మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో జరుగునని ఈ పార్టీ కార్మికుల పక్షాన పార్టీ అని ఈ మహా సభకు కార్మిక కర్షిక ప్రజాసంఘాల నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు వేలాదిగా తల్లి రావాలని ఇంటింటి ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేసి ఆహ్వానించారు. అనంతరం మోడీ ప్రభుత్వం నిరంకుశ ధోరణి ప్రజలపై అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను వివరిస్తూ రాజ్యాంగ నిర్మాతను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయబ్ రసూల్, అన్వర్, ఫరీద్ భాషా, బాలకృష్ణ, మంద శ్రీనివాసులు, మాలిక్, మంద రమణయ్య పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కోవూరు : నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర 27వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ కోవూరు మండలంలోని పార్టీ శాఖలు పాటూరు, పోతిరెడ్డిపాలెం, పెద్ద పడుగుపాడు గ్రామాలలో ప్రజల నుండి విరివిగా విరాళాలను సేకరించారు. ఫిబ్రవరి 3న జరిగే ర్యాలీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ కరపత్రాలు ప్రచార చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు, గండవరపు శేషయ్య బుజ్జయ్య, పెద్దబ్బయ్య, విజయ్ కుమార్, సర్దార్ అహ్మద్, భోగేశ్వరరావు, రమణయ్య, సుబ్రహ్మణ్యం, సురేష్, జానకిరామ్, చాన్‌బాషా, మస్తానయ్య, శ్రీనివాసులు, మోహన్, తదితరులున్నారు.



రాజగోపాల్ రెడ్డికి 'కల్లూరి' కృతజ్ఞతలు

ప్రజాశక్తి-ఉదయగిరి : నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డికి శకునాలపల్లి సర్పంచ్ జిల్లా వైసిపి యాక్టివిటీస్ సెక్రటరీ కల్లూరి వెంకటేశ్వర రెడ్డి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం బెంగళూరు లోని మేకపాటి రాజగోపాల్ రెడ్డి తన అతిథి భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కల్లూరి మాట్లాడుతూ శకునాలపల్లి సర్పంచ్‌గా ఉన్న తనకు ఇంత కీలక పదవిని మాజీసిఎం జగన్ ఆదేశాలతో మాజీ మంత్రి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి సారథ్యంలో వైసిపి జిల్లా సెక్రటరీ (యాక్టివ్ టీమ్)గా నియామకం ఏర్పాటుకు కృషిచేసిన ఉదయగిరి ఇన్‌ఛార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇకనుండి పార్టీ బలోపేతంకు కార్యకర్తలకు అండగా నిలిచేందుకు అధిష్ఠానం తన నియామకంకు కృషి చేసిన పెద్దల నమ్మకాలను వమ్ము చేయకుండా వారి సూచనలతో పార్టీ గెలుపే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు.



నూతన దంపతులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : నెల్లూరులోని కెజికె కళ్యాణ మండపంలో ఎఎస్ పేట మండల వైసిపి నాయకులు, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సందాని భాషా కుమార్తె వివాహానికి మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి, వైసిపి నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

చెత్తనూనెతో ఆహారం తయారీ : సిపిఎం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

ఆరోగ్యానికి హాని కలిగించే మడ్డి ఆయిల్ పలు చిప్స్ దుకాణాల్లో వినియోగిస్తున్నారని, అది ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమని సిపిఎం నాయకులు ముత్యాల గురునాథం పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం చెన్నూరు రోడ్డులో ఆలుచిప్స్ తయారు చేసే దుకాణంలో ఆదివారం రోజు మడ్డి ఆయిల్ ద్వారా చిప్స్‌ను తయారు చేయడం గమనించిన ముత్యాల గురునాథం, ఎం వి శేషయ్య ఆ విధానాన్ని అడ్డుకొని దుకాణా దారుని మందలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో స్వీట్, చిప్స్, చికెన్ పకోడీలు తయారు చేసే దుకాణా ల్లో చాలా వరకు మడ్డిఆయిల్‌ను ఉపయోగిస్తు న్నారని దానివల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుంద న్నారు. నగర కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి మడ్డి ఆయిల్‌ను ఉపయోగించే దుకాణాలపై దాడులు జరిపి అట్టివారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

పోతిరెడ్డిపాలెంలో పడకేసిన పారిశుధ్యం

- అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యం - రోగాల బారిన పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కోవూరు : అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వల్ల పారిశుధ్య పనులు లోపించి, కాలుష్యం కోరల్లో ఉండి ప్రజలకు వైరల్ జ్వరాలు సోకుతున్న వైనం కోవూరు మండలంలో ప్రధానమైన పోతిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీలో వెలుగు చూసింది. ప్రభుత్వం ఒకపక్క పంచాయతీ అభివృద్ధిపై అధికారులు అప్రమత్తం కావాలని సూచనలు ఇస్తుంటే ఇక్కడ మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్లు ఉంది. ప్రజలు మాటలు ఖాతరు చెయ్యడం లేదు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉంది. ఈ రోజుల్లో చైతన్యం చెందిన పంచాయతీలు కూడా ఈ దుస్థితిలో ఉందంటే ఉన్నత అధికారులు దానిపై దృష్టి సారించి ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యతలు ఎంతైనా ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పోతిరెడ్డిపాలెం మేజర్ పంచాయతీ జాబితాలో ఉన్నప్పటికీ ఇక్కడ పాలక వర్గానికి సంబంధించిన అధికారుల నిర్లక్ష్యం ధోరణి వల్ల గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. కూతవేటు దూరంలో కోవూరు ఉన్నా కూడా దానిని చూసి అయిన అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయాలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఎంఎల్ఎ దృష్టికి పెడతామని హెచ్చరిస్తున్నారు. సత్వరమే చర్యలు తీసుకొని పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడాలని కోరుతున్నారు. మురుగు నీరును, పేరుకు పోయిన చెత్తను పంచాయతీ తొలగించి క్లీన్ అండ్ గ్రీన్ చెయ్యాలని కోరుతున్నారు.

CHANGE OF NAME

I, PARRI MADHAVI RESIDENT OF PATHURU, Ramatherdam, VIDAVALURU, Nellore District-524218. HAVE CHANGED MY NAME FROM **PARRI MADHAVI** TO **PARRI KAMAKSHI**

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM
OS 584/2023

Between:
Pulagam Narayana Reddy .....Plaintiff
And:-
Shaik Khaja Rasool .....Defendant.

To,
Shaik Khaja Rasool, S/o Knadhar Bhasha, Teacher, MPUP School, Irlapadu village, Marripadu mandal SPSR Nellore District .R/at Kasipalem Buchireddi palem, SPSR Nellore District.

NOTICE

It is to inform you that the above matter stands posted to on **10-01- 2025** for your appearance .Hence you have to appear before the Honourable court on **10-01-2025 at about 10.30 Am** .as in person or through an advocate without fail,otherwise the matter will be decided in your absence.

// By order of the Honourable court//

B.GOVINDA RAJU
ADVOCATE,
SRIKAKULAM.